క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: లోధా సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా, అల్లావుద్దీన్ కోఠి, లిక్కర్ కంపెనీ, డీఎస్‌ఎంకాలనీ, అశోక్‌కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్‌ఆర్‌టీ పార్క్, టీవీఎస్ షోరూం లేన్, మెథడిస్ట్ చర్చి లేన్, డీ-మార్ట్ ఎదురు ప్రాంతంలో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

మహంకాళి దేవాలయంలో చండీహోమం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో శుక్రవారం చండీ హోమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించిన హోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, మాజీ ధర్మకర్తలు పాల్గొన్నారు.

సింపోజియాలతో సృజనాత్మకత



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: సింపోజియాలతో ఇంజినీరింగ్ విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఈసీఈ విభాగంలో ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సింపోజియానికి హాజరై సావనీర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొ.రామకృష్ణ, డా.నవీన్, స్టూడెంట్ కోఆర్డినేటర్ రుత్విక్‌రెడ్డి, సి.అభిచందన పాల్గొన్నారు.

మింగ్స్ కోర్ట్ రెస్టారెంట్ ప్రారంభం



రాంగోపాల్‌పేట్: రుచికరమైన చైనీస్ వంటకాలతో సికింద్రాబాద్‌లోని ఓక్రీస్ ఆధ్వర్యంలో మింగ్స్ కోర్ట్ రెస్టారెంట్ ప్రారంభమైంది. మింగ్స్ కోర్ట్ 25వ వార్షికోత్సవం సందర్భంగా మూడవ శాఖను ప్రారంభించినట్లు సంస్థ ఏరియా మేనేజర్ సపటదిప్ రాయ్ తెలిపారు. మింగ్స్‌కోర్ట్‌లో రుచికరమైన క్లాసిక్ చైనీస్ వంటకాలైన జియాంగ్ చిల్లీ చికెన్, కాంజీ క్రిస్పి లాంబ్, కాంటోనీస్ ఫ్రైడ్ నూడిల్స్‌తో పాటు ఆధునిక వంటకాలైన స్పైసీ సిసామి చికెన్, ఓరియెంటల్ ఫ్రైడ్ స్ప్రింగ్ రోల్ ఆహార ప్రియుల కోసం సిద్ధంగా ఉంటాయన్నారు.

గాంధీనగర్‌లో విషాదఛాయలు



నివాళులు అర్పిస్తున్న క్రిశాంక్

కంటోన్మెంట్: కానాజీగూడలో కారు ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన స్విగ్గీ డెలివరీ ఉద్యోగి రాజు అంత్యక్రియలు ముగిశాయి. తెలంగాణ మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్, లాస్య నందిత, మాజీ బోర్డు సభ్యురాలు నళిని, స్థానిక నేత పనస సంతోష్ తదితరులు రాజు మృతదేహానికి నివాళులర్పించారు. రాజు కుటుంబానికి తన వంతు ఆర్థిక సాయం అందజేయడంతో పాటు వారికి అండగా ఉంటానని క్రిశాంక్ హామీ ఇచ్చారు.

ఆకలి తీర్చడం అభినందనీయం

సనత్‌నగర్: శ్రీనివాస సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో వందలాది మంది ఆకలి తీరుస్తూ స్ఫూర్తి నింపుతున్నారని బల్కంపేట ఎల్లమ్మ-పోచమ్మ దేవస్థానం ఈఓ ఎస్.అన్నపూర్ణ అన్నారు. బీకేగూడ పార్కు వద్ద కొనసాగుతున్న మధ్యాహ్న మిత భోజన కార్యక్రమంలో శుక్రవారం ఆమె దాతగా వ్యవహరించారు. అన్నపూర్ణ దంపతులతో పాటు డాక్టర్ పునీత, భాను-శివరావు దంపతులు సైతం దాతలుగా ముందుకు వచ్చారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి యేటా వేసవిలో క్రమం తప్పకుండా రెండు నెలల పాటు అన్నార్తుల ఆకలి తీర్చడంలో వయోధికుల కృషి ఎనలేనిదన్నారు. మానవ సేవే మాధవ సేవగా భావించి శ్రీనివాస సమాజ సేవా సమితి తరుపున మధ్యాహ్న మిత భోజన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించడం శుభపరిణామం అన్నారు. ట్రస్టీ పార్థసారథి, కృష్ణారెడ్డి, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐసీయూలో తల్లి .. ఆకలితో చిన్నారి

- ఆస్పత్రిలో చేర్పించి భర్త గాయబ్
- మానవత్వం చాటుకున్న గాంధీ సెక్యూరిటీ సిబ్బంది



సెక్యూరిటీ షెడ్‌లో ఇడ్లీ తింటున్న సాత్విక్



వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న మాధవి

గాంధీఆస్పత్రి: చావుబతుకుల మధ్య తల్లిప్రాణం కొట్టుకుంటుంది.. ఆరుబయట చిన్నారి ఆకలితో అల్లాడుతున్నాడు. నేనున్నాను అనే భరోసా ఇవ్వాల్సిన వ్యక్తి తనకేమి పట్టనట్లు ఇద్దరినీ అలాగే వదిలేసి వెళ్లిపోయాడు. ఆకలితో పాటు అమ్మ కోసం ఏడుస్తున్న చిన్నారిని చేరదీసి, ఆకలి తీర్చి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న తల్లిని చూపించి మానవత్వం చాటుకున్నారు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ సలూరాకేంపు ప్రాంతానికి చెందిన గంగాధర్, మాధవి భార్యాభర్తలు. వీరికి ఆరేళ్ల బాబు సాత్విక్ ఉన్నాడు. రెండవ కాన్పు కోసం ఈ నెల 1న మాధవి గాంధీ ఆస్పత్రిలో చేరింది. అదే రోజు ఆడశిశువు పుట్టిన వెంటనే చనిపోయింది. తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయస్థితి చేరిన మాధవికి మెటర్నిటీ ఇన్సెంటివ్ కేర్ యూనిట్ (ఎంఐసీయూ) లో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు.

జాడలేని భర్త ఆచూకీ..

కారణం తెలియదు కానీ మాధవి భర్త గంగాధర్ ఈనెల 2వ తేదీన కుమారుడు సాత్విక్‌ను గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో వదిలేసి వెళ్లిపోయాడు. ఆకలితో అల్లాడుతూ అమ్మ కోసం రోధిస్తున్న చిన్నారిని గాంధీ సెక్యూరిటీ సిబ్బంది గమనించి అన్నం పెట్టి బుజ్జగించి ఆరా తీశారు. పలు వార్డులను తిప్పుగా వెంటిలేటర్‌పై అపస్మారకస్థితిలో ఉన్న అమ్మను చిన్నారి సాత్విక్ గుర్తించాడు. కేస్‌షీట్‌లో ఉన్న గంగాధర్ సెల్‌ఫోన్ నంబరుకు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తోంది. గాంధీ సెక్యూరిటీ సూపర్‌వైజర్ శివాజీ నేతృత్వంలో సిబ్బంది ఆంజనేయులు, శ్రీకాంత్, నర్సింహ, కళ్యాణ్, నాగరాజు, శివకుమార్, వరలక్ష్మీ, లావణ్య, అనురాధలు గత మూడు రోజులుగా చిన్నారి సాత్విక్‌ను షిఫ్ట్‌డ్యూటీ ప్రకారం వంతుల వారీగా చేరదీసి అన్నం పెట్టి ఆకలి తీర్చి అమ్మను మరిపిస్తున్నారు. ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతున్న మాధవికి రోగి సహాయకులు లేకపోవడంతో మెడికో లీగల్ కేసు (ఎంఎల్‌సీ)గా పరిగణించి వైద్యసేవలు అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. మాధవి కుటుంబసభ్యులకు సమాచారం అందించేందుకు ఆధారంగా ఉన్న ఫోన్ నంబరు కాల్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోందన్నారు. చిన్నారిని చేరదీసి మానవత్వం చాటుకున్న సెక్యూరిటీ సిబ్బందిని గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, జీడీఎక్స్ సెక్యూరిటీ సంస్థ ప్రతినిధి రవికుమార్‌లతో పాటు పలువురు వైద్యులు, రోగి సహాయకులు అభినందిస్తున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

చెక్కులు అందజేస్తున్న మంత్రి

సనత్‌నగర్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. 90 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం ఆయన అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనే ఆలోచనతో దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని వివరించారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆడబిడ్డ పెళ్లికి పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వపరంగా కొంత చేయూతను అందించే ఉద్దేశ్యంతో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని గత ప్రభుత్వాలు గానీ, దేశంలో ఏ రాష్ట్రంలో గానీ అమలు చేస్తున్న దాఖలాలు లేవన్నారు. ఇవేకాక వృద్ధులు, వితంతులు, వికలాంగులకు ఆసరా పెన్షన్ ద్వారా నెలనెలా ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నామన్నారు. ఆరోగ్య సమస్యలకు కూడా వేలాది రూపాయలు ఖర్చు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వ ఆస్పత్రులను కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసి మెరుగైన వైద్య సేవలు, వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, అరుణగౌడ్, తహసీల్దార్ విష్ణుసాగర్ పాల్గొన్నారు.

పాత్రికేయులకు ఇళ్లు మంజూరు చేయాలి



మంత్రి తలసానికి వినతి పత్రం అందజేస్తున్న హెచ్‌యూజే నేతలు

కంటోన్మెంట్: అర్హులైన పాత్రికేయులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూయూజేఎఫ్) బృందం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు కలిసి విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు ప్రభుత్వం స్థానికంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తోందని, హైదరాబాద్ జిల్లాలోనూ ఇండ్లు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో జగదీశ్, రాజశేఖర్, నాగవాణి, ప్రశాంత్, రేణయ్య, కొప్పు నిరంజన్ ఉన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రులు

కంటోన్మెంట్: తెలంగాణ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (టీఎస్-ఎంఎస్‌ఐడీసీ) చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మారేడుపల్లి మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్లో జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

31వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష



రిలే దీక్షను ప్రారంభిస్తున్న ఆలకుంట హరి

లాలాపేట: చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మిద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 31వ రోజుకు చేరుకున్నాయి. ఈ మేరకు శుక్రవారం దీక్షలో వడ్డెర బస్తీ వాసులు పాల్గొన్నారు. వారికి పూలమాల వేసి దీక్షను ప్రారంభించిన బీఆర్‌ఎస్ గ్రేటర్ యూత్ వింగ్ అధ్యక్షులు ఆలకుంట హరి మాట్లాడారు. బస్తీలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని నెల రోజులుగా దీక్ష చేస్తున్నా స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరం అన్నారు. ఇక బస్తీ వాసులమంతా రోడ్డెక్కే పరిస్థితి వస్తుందన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు. సాయంత్రం సీనియర్ నాయకులు గండికోట రవితేజ, డాక్టర్ నర్సయ్య తదితరులు రిలే దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

విద్యార్థిని ఔదార్యం



ఫోన్ అప్పగిస్తున్న ఎస్‌ఐ బాలరాజ్

సనత్‌నగర్: బస్సులో దొరికిన రూ.1.40 లక్షలు విలువైన ఐఫోన్-14 ఫ్రోను ఓ విద్యార్థిని పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకుంది. ఎస్సార్‌నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ బాలరాజ్ వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన విద్యార్థిని ఐశ్వర్య తన ఐఫోన్-14 ఫ్రోను బస్సులో పోగొట్టుకుంది. అదే బస్సులో ప్రయాణించిన బోరబండకు చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో బీఎస్సీ చదువుతున్న ప్రణీతకు దొరకడంతో తన తండ్రి ద్వారా ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించింది. పోలీసులు బాధిత విద్యార్థిని తండ్రిని పిలిపించి ఫోన్ అప్పగించి ప్రణీతను అభినందించారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై మాయావతి స్పష్టత ఇవ్వాలి



మాట్లాడుతున్న సోమశేఖర్

బౌద్ధనగర్: బీఎస్పీ ఆధ్వర్యంలో ఈ నెల 7న జరుగనున్న తెలంగాణ భరోసా సభకు రానున్న మాయావతి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పట్ల తమ స్పష్టమైన వైఖరి తెలియజేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్‌ఎఫ్) జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ల విధానంతో ఎస్సీలలోని మెజార్టీ జనాభా ఉన్న కులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. సామాజిక న్యాయమైన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ డిమాండ్ పట్ల ఎస్సీల పార్టీ, బహుజనుల పార్టీ అని చెప్పుకునే బీఎస్పీ వర్గీకరణపై తమ స్పష్టమైన వైఖరిని చెప్పకపోవడం విడ్డూరమన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 29 ఏళ్లుగా సుదీర్ఘ ఉద్యమం నడుస్తుందని ఓ పక్క అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు వర్గీకరణ జరగాల్సిందేనని ఉద్యమానికి మద్దతు తెలియజేస్తూ వారి ఎన్నికల మేనిఫెస్టోలో వర్గీకరణ అంశాన్ని పెట్టి మద్దతిస్తుంటే బీఎస్పీ పార్టీ మాత్రం తమ అభిప్రాయాన్ని వెల్లడించకుండా మూస ధోరణిని పాటిస్తుందని విమర్శించారు. తెలంగాణ భరోసా సభలోనే ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా మాయావతి నిర్ణయాన్ని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. వర్గీకరణకు మద్దతు ఇవ్వని ఏ పార్టీని కూడా మాదిగలు విశ్వసించరని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంఎస్‌ఎఫ్ నాయకులు కొమ్ము శేఖర్, ఎమ్మార్పీఎస్ నేత భూషపాక గణేష్, ఎంఎస్పీ నేతల డప్పు మల్లికార్జున్, ఎంఎంఎస్ నేత సూరారం సుజాత, గజ్జల రాజశేఖర్, బలరాం, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

అవినీతి ఎమ్మెల్యేల వివరాలను బహిర్గతం చేయాలి



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్: దళిత బంధు పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేల జాబితాను బయటపెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ జబ్బార్ కాంప్లెక్స్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద శుక్రవారం మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్పీ), ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ బుషిపాక గణేష్ పర్యవేక్షణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల వివరాలను రాష్ట్ర గవర్నర్ తెప్పించుకొని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందక్రిష్ణ మాదిగ నేతృత్వంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు వారు వెల్లడించారు. ఎంఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ మహేష్ మాదిగ, అజయ్ పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

సనత్‌నగర్: చేతి పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అమీర్‌పేట ఆస్టర్‌ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహనే నిర్వహించారు. ఆస్పత్రి కన్సల్టెంట్ మైక్రోబయాలజిస్టు డాక్టర్ సఫా అహ్మద్, చీఫ్ ఇన్ఫెక్షన్ కంట్రోలింగ్ నర్సింగ్ ఆఫీసర్ సోనియా, నర్సింగ్ విభాగాధిపతి రేవతి పాల్గొని అంటువ్యాధులు, యాంటీ మైక్రోబయల్ నిరోధకాలను నివారించే ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. రోగులకు చాలా దగ్గరగా పనిచేసే నర్సింగ్, హౌస్ కీపింగ్ సిబ్బంది చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అజాగ్రత్తగా వ్యవహరిస్తే ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన పరిస్థితులను సైతం సిబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

'గాంధీ'లో ఆరుగురు కాంట్రాక్టు సిబ్బందికి క్రమబద్ధీకరణ



గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఫార్మాసిస్టులతో కలిపి మొత్తం ఆరుగురిని రెగ్యులర్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతన సచివాలయం ప్రారంభం సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లోని 40 విభాగాలలో పనిచేస్తున్న 5544 మంది కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేస్తూ ఫైల్‌పై సీఎం కేసీఆర్ సంతకం చేసిన సంగతి విదితమే. ఈ మేరకు గాంధీ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిన ఫార్మాసిస్ట్ గ్రేడ్-2లుగా పనిచేస్తున్న అనురాధ, అంబుజా, స్వప్న, నవీన్, ల్యాబ్ టెక్నీషియన్ శోభారాణి, ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్‌రెడ్డిలను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించనున్నారు. గత 22 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న తమకు ఇప్పటికి రెగ్యులరైజ్ కావడం సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, డీఎంఈ రమేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

'బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారు'



గోడపై కమలం గుర్తు వేస్తున్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: బీఆర్‌ఎస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు ప్రత్యామ్నాయ పార్టీగా బీజేపీని కోరుకుంటున్నారని బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు, వాల్ పెయింటింగ్ డివిజన్ ఇన్‌చార్జ్ గెల్లు ఉదయ్ యాదవ్ అన్నారు. శుక్రవారం అడ్డగుట్ట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గోడలపై కమలం గుర్తును వేశారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని రెండేళ్లలోపే వందల కోట్లు వెచ్చించి సెక్రటేరియట్ నిర్మించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం, పేద ప్రజలకు డబుల్ బెడ్రూమ్ ఇవ్వలేకపోతుందన్నారు. రాష్ట్రంలోనే సమస్యలను పరిష్కరించలేని కేసీఆర్ దేశాన్ని మారుస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ తిరిగి గోడలకు కమలం గుర్తు వాల్ పెయింటింగ్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజేపీ నేతలు సాయిబాబా, రాజేష్, మంద సురేష్, నందు పాల్గొన్నారు.

పర్యవేక్షణ కరువై.. ప్రమాదానికి నెలవై



ప్రొ. జయశంకర్ స్టేడియం ఆవరణలో కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణంలో ఇటీవల కురిసిన వర్షాలకు వరద చేరింది. పనుల వద్ద ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో స్టేడియంలోకి ఆడుకోవడానికి వచ్చిన వారు ఈత కొడుతున్నారు. చుట్టూ, లోపల ఇనుప కడ్డీలు తేలి ఉన్నాయి. పిల్లలు దూకినప్పుడు రాడ్లు తగిలి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. దీంతో దీన్ని గమనించిన సోషల్ వర్కర్ నేతికార్ మహేశ్ వెళ్లి అక్కడి నుంచి చిన్నారులను పంపించేశారు. - లాలాపేట



బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మోతే శోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక డివిజన్ ఆటో యూనియన్‌కు చెందిన పలువురు ఆటో డ్రైవర్లు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరగా వారిని కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శోభన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అని రాష్ట్రంలో గత తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పార్టీలోకి చేరుతున్నారన్నారు. పాత, కొత్త అనే తేడా లేకుండా అందరూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు.

టీఎస్‌పీఎస్సీ పరీక్షలను అడ్డుకుంటాం

ఉస్మానియా యూనివర్సిటీ: పాత వారిని తొలగించకుండా టీఎస్‌పీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తే అడ్డుకుంటామని ఓయూ విద్యార్థులు హెచ్చరించారు. శుక్రవారం ఓయూ క్యాంపస్ నుంచి టీఎస్ జాక్, బీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్‌భవన్ ర్యాలీని పోలీసులు అడ్డుకొని విద్యార్థి నేతలు వేల్పుల సంజయ్, కొత్తపల్లి తిరుపతి, పులిగంటి వేణుగోపాల్ అరెస్ట్ చేశారు.

గన్‌పట్టి.. గురిపెట్టి

ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ



సూచనలు చేస్తున్న అధికారిణి



తుపాకీ గురిపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

రసూల్‌పురా: ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో ఒకటో తెలంగాణ గర్ల్స్ బెటాలియన్ కేడెట్లకు బేగంపేట సేయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలో వార్షిక శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆఫీసర్ కమాండింగ్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రదీప్‌కుమార్ నేతృత్వంలో అడ్మిన్ ఆఫీసర్, ఐదుగురు అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు ఇద్దరు గర్ల్స్ కేడెట్లు ఇన్‌స్ట్రక్టర్లు, 15 మంది మిలిటరీ సిబ్బంది శిక్షణ ఇస్తున్నారు. 600 మంది కేడెట్లకు ఆయుధ శిక్షణ, మ్యాప్ రీడింగ్, ఫిల్డ్ క్రాఫ్ట్, లీడర్‌షిప్‌లో శిక్షణ ఇస్తున్నారు. వీటితో పాటు మార్చింగ్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు, సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.